TRC
TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

05.09.2015

హైద్రాబాద్.

# భవిష్యత్ తరాన్ని నిర్మించేది ఉపాధ్యాయులే!

హిమాయత్‌నగర్‌లోని చంద్రం బిల్డింగ్‌లో తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ వారం 190వ చర్చగా **"తెలంగాణ రాష్ట్రం–సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర"** అనే అంశంపై టిఆర్‌సి చర్చా కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డితో పాటుగా వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కె. రవిచందర్ (అధ్యక్షులు, గిరిజన సంక్షేమ ఆవాస పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం), ఎంఎన్ కిష్టప్ప (కార్యదర్శి, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్), గాజుల శ్రీధర్ (ఉపాధ్యక్షులు, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్), బి.భుజంగరావు (అధ్యక్షులు, స్టేట్ టీచర్స్ యూనియన్), మల్లీశ్వరి (ప్రధాన కార్యదర్శి, తెలంగాణ విమెన్ టీచర్స్ ఫెడరేషన్), కస్తూరి ప్రభాకర్ (తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్) తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఉపాధ్యాయుల, ఉపాధ్యాయ సంఘాల స్వరూప స్వభావాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి కర్తవ్యం, బాధ్యత మరింత పటిష్ఠం, విస్తృతం కావాల్సిన అవసరం ఉందని, ఆ కృషిని వారు కొనసాగించాలన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో ఉండిన విద్యావిధానాలను మార్చుకోవాలని, ఆయా సమస్యల పరిష్కారాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు.

కొఠారీ అన్నట్లుగా దేశభవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకోవాలని, అదే విధంగా తెలంగాణ సమాజ భవిష్యత్‌కు కూడా తరగతి గది ఆధారం కావాలని అన్నారు.తరగతి గది కూడా సమాజంలో భాగమేనంటూ, తెలంగాణ ఆవిర్భావం అనంతరం సమాజంతో పాటు విద్యారంగంలో మౌలిక మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. రేపటి భవిష్యత్ తరాన్ని నిర్మింపజేసుకునే క్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకమైందని పేర్కొన్నారు.

గత ఆరు దశాబ్దాలుగా కొనసాగిన వలసాధిపత్య, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకోవాలని సూచించారు.అందరికీ సమాన విద్యావకాశాలు అందించాలని, కేజీ టు పీజీ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. సామాజిక, ఆర్థిక అసమానతలకు తావు లేని విధంగా విద్యను అందించడం ప్రభుత్వ కనీస కర్తవ్యం కావాలని అభిలషించారు. సిలబస్‌లో కొన్ని మార్పులు వచ్చినప్పటికీ, మరెన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ యం.వేదకుమార్ మాట్లాడుతూ, వ్యవస్థకు, సమాజానికి ఉపాధ్యాయుడు మూలస్తంభమని అన్నారు. సమాజ పరివర్తనకు కారకాలుగా పాఠశాలలు వెలుగొందాలన్నారు. తల్లిదండ్రులు ఇచ్చే శిక్షణ మాదిరిగా ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణ ఉండాలన్నారు. అందుకు పాఠశాల వేదిక కావాలన్నారు. గతంలో ఇలాంటి సంస్కృతి మన వద్ద ఉన్నప్పటికీ కాలక్రమంలో అది మార్పులకు లోనైపోయిందన్నారు. సమాజంలో చైతన్యం రావాలని, అందుక పాఠశాలలు వేదికలు కావాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, తోటి వారిని గౌరవించడం, మూగజీవాల పట్ల సానుభూతి లాంటివన్నీ విద్యాబోధనలో భాగం కావాలని అభిలషించారు. త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను మరింత చైతన్యవంతం చేసే బాధ్యతను పాఠశాలలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. బట్టీ పట్టడం, పోటీ పరీక్షలే విద్య లక్ష్యం కాదన్నారు. మెడికల్, ఇంజినీరింగ్ మాత్రమే గాకుండా మరెన్నో వృత్తులు, కళలు సమాజానికి అవసరమని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఎన్ని ఉన్నా కూడా ఆయా అంశాల్లో అవి ఒక్కతాటి మీదకు రావాలన్నారు. సమాజానికి చైతన్య కేంద్రాలుగా పాఠశాలలు ఉండాలని ఆశించారు. పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు అన్ని విధాలుగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ఎస్.వెంకట నారాయణ, జయరాముడు, డి.ఆదిత్య వర్ధన్, పి.గిరిజ, శ్రీనివాస్ బహదూర్, కె.విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు, ప్రజాగాయకుడు భిక్షపతి మరణం పట్ల సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**నీరజ**

**టిఆర్‌సి**